అడ్వెంచరస్ స్పిరిట్

వసుంధర

థియేటర్లో సినిమా నడుస్తోంది. లోపల జనం పల్చగా ఉన్నారు. అందరికంటే బాగా వెనుక సీట్లలో కూర్చున్నారు చంప, ప్రవీణ్. వారికి ముందు, పక్కల ఎవ్వరూ లేరు. అందుకే వాళ్ళు సినిమా చూడకుండా కబుర్లు చెప్పుకుంటున్నారు.

"చాలా థాంక్స్ చంపా! నీతో కలిసి సినిమా చూసే అవకాశమిచ్చావు—" అన్నాడు ప్రవీణ్.

"కానీ నువ్వు సినిమా చూడ్డం లేదు...." అంది చంప.

"అది థియేటర్ కానీ పూలతోట కానీ తాజ్‌మహల్ కానీ నువ్వెక్కడున్నా నిన్నే చూడ్డం ఇష్టం నాకు—" అన్నాడు ప్రవీణ్.

ఎర్రబడిన కారణంగా చీకట్లో చంప బుగ్గలు మెరిశాయి—"నీ కందుకూ నేనంటే అంత యిష్టం!" అందామె.

"మాటల్లో చెప్పలేను. కానీ నాకు నువ్వంటే ఇష్టం

నువ్వంటే నే యిష్టం —" అన్నాడతడు.

చంప నెమ్మదిగా—"నాకూ నువ్వంటే యిష్టమే!" అంది.

"మెనీ మెనీ థాంక్స్!" అన్నాడు ప్రవీణ్.

"అందుకే నేమో మన యిష్టం ప్రేమగా మారడానికి వీల్లేదు—" అంది చంప.

"ఈ విషయం చాలాసార్లు చెప్పావు. నీ బాబయ్యకు నేనంటే యిష్టంలేదు. ఎందుకంటావ్?"

"బాబయ్యకు నేనంటే చాలా యిష్టం. ఎందుకో తెలుసా?"

అతడు తల అడ్డంగా వూపాడు. చీకటికి అలవాటు పడ్డ కళ్ళు విశేషం చూశాయి.

చంప చెబుతూంటే అతడు వింటున్నాడు.

నారాయణరావు, మధుసూదన్ అన్నదమ్ములు. ఇద్దరికీ ఒకరంటే ఒకరికి ప్రాణం. ఆ కారణంగా పెళ్ళిళ్ళయ్యాక కూడా విడిపోకుండా కలిసే ఉంటున్నారు. నారాయణ రావు కూతురు చంప. చంపకు రెండేళ్ళవయసప్పుడు వారంతా తిరుపతి వెడుతూండగా ప్రమాదానికి గురయ్యారు. అందులో మిగిలినది చంప, మధుసూదన్. జరిగిందానికి మధుసూదన్ బాగా అప్సెట్టయ్యాడు.

ఇన్సూరెన్స్ వల్ల అతడికి లక్షరూపాయలు వచ్చాయి. ఉన్న ఆస్తి అమ్మితే మరో లక్ష వచ్చింది. ఆ డబ్బును బ్యాంకులో వేసి చంపను కన్నకూతురిలా చూసుకో సాగేడతడు. ఆమెకైదు సంవత్సరాలొచ్చేవరకూ ఇంట్లోనే ఉండిపోవడం కోసం — అంతకాలం తను చేస్తున్న ఉద్యోగం వదులుకున్నాడు. ఆమెను స్కూల్లో వేశాక తను మళ్ళీ ఉద్యోగంలో చేరాడు. వచ్చే జీతం అంతంత

మాత్రమైనా పట్టించుకోలేదు.

మళ్ళీ పెళ్ళిచేసుకోమని ఎందరో అతణ్ని బలవంత పెట్టారు. అతడిలో విరక్తిభావం ప్రవేశించడంవల్ల అందు కంగీకరించలేదు. క్రమంగా అతడికి చంప అంటే మమకారం ఏర్పడింది. చెప్పాలంటే ఆమె కోసమే అతడు జీవిస్తున్నాడు.

"బాబాయి నన్ను కన్నతల్లికంటె మిన్నగా పద్దెనిమిదేళ్ళు పెంచాడు. నా కోసమే జీవిస్తున్నాడు. ఆయనకు నేనంటే యిష్టముండదూ?"

అవునన్నట్లు తలూపాడతడు—"కానీ ఆయనకు నేనంటే ఎందుకిష్టంలేదు?"

"నా పేరున రెండు లక్షలున్నాయి. ఇప్పుడు బాబాయికి ఉద్యోగంమీద వచ్చే ఆదాయంకూడా బాగా ఎక్కువ. ఆయనకు నేనుతప్ప ఎవ్వరూ లేరు. అందువల్ల నన్నాయన చాలా పెద్దింట్లో యివ్వాలని అనుకుంటు న్నాడు—" అంది చంప.

"పెద్దింట్లో అంటే!"

"నా ఆస్తిమీద ఆశపడకుండా—నా కంటే ఆస్తిలో గొప్పవారై ఉండాలి—"

"చంపా—నేను నిజం చెబుతున్నాను. నాకు నీ ఆస్తిమీద మోజులేదు...."

"నేను నమ్ముతాను. కానీ బాబాయి నమ్మడు...."

"ఎందుకని?"

"ప్రస్తుతం నీ జీతం నెల కాయవందలు. స్వంతిల్లు లేదు. పెళ్ళి చేసుకుంటే భార్య కోరికలు తీర్చలేవు. అసహాయత నీలో ఉక్రోషాన్ని రెచ్చగొడుతుంది నా ఆస్తిమీద ఆశను పుట్టిస్తుందా ఉక్రోషం. ముందు

సుఖసుఖుడుతో ప్రారంభమై తర్వాత శాసించడం మొదలు పెడతావు. ఆ తర్వాత నా ఆస్తితో నీకు దూరలవాట్లు— నాకు దుర్భర కష్టాలు....”

“చంపా—ఏమిటి నువ్వంటున్నది?”

“నేను కాదు—నా బాబాయంటున్నాడు....”

“అంటే నువ్వు నమ్మావా?”

“నేను నమ్మలేను. కానీ ఏం ప్రయోజనం?”

“చంపా—నువ్వుకూడా నీ బాబాయి మాటలు నమ్ముతున్నావు. లేకుంటే నిన్నంతగా ప్రేమించిన నీ బాబాయిని నమ్మించడం నీ కసాధ్యం కాదు....”

“బాబాయి దగ్గర నేనేం మాట్లాడలేను. ఆయన మాట నాకు వేదవాక్కు....”

“అయితే మన ప్రేమ ఫలించదా?”

“అలాగే కనబడుతోంది—”

“చంపా—నా కోసం నువ్వేమీ చేయలేవా?”

“నీ కోసం నేను నా బాబాయిని ఎదురుకోవడం కూడా సిద్ధమే! కానీ నువ్వే ఆలోచించు. పద్దెనిమి దేళ్ళపాటు నన్ను కంటికిరెప్పలా—కన్నతల్లికంటె మిన్నగా పెంచిన బాబాయిని కాదని నేనిల్లు వదిలి పెడితే- ఆయ నేమైపోతాడు? ఆయన గురించి ఆలోచించాల్సిన బాధ్యత ఎంతో కొంత నాకుంది కదా!”

“నువ్వు చెప్పింది నిజం. అయితే ఇంకే ఉపాయమూ లేదా?”

“ఒక ఉపాయముంది. కానీ నీకు చెప్పడానికి సంకోచిస్తున్నాను—”

“చెప్పు చంపా! నీ కోసం నే నేమైనా చేయగలను!”

“ఏమైనా అంటే హత్య చేయగలవా?”

తెల్లబోయాడు ప్రవీణ్ — "హత్యా?"

"అవును. అందుకే నీకు చెప్పడంలేదు...."

"అసలు హత్య ఎందుకు చేయాలి?"

"అవన్నీ నీ కెందుకు?"

ప్రవీణ్ క్షణం ఆలోచించి — "ఎందుకో తెలుసు కుంటే నేను హత్యయినా చేస్తానేమో!" అన్నాడు.

"ఈ ఊళ్ళో శివరాజా తెలుసా నీకు?"

"తెలియదు...."

"శివరాజు పెద్దమనిషిగా చెలామణీ అవుతున్న సమాజ ద్రోహి—"

"ఊఁ"

"ఆ శివరాజును నువ్వు చంపేయాలి—"

"ఎందుకు?"

"శివరాజా బ్లాక్ మెయిలర్. ఆయన నా బాబాయిని బ్లాక్ మెయిల్ చేస్తున్నాడు...."

"ఏమని?" అన్నాడు ప్రవీణ్ ఆశ్చర్యంగా.

చంప నెమ్మదిగా— "బాబాయి తప్పు చేశాడు—" అంది.

"తప్పంటే?"

చంప చెప్పసాగింది.

పెళ్ళయితే చేసుకోలేదుకానీ— వయసు రేపే కోర్కెల నణచుకోలేక మధుసూదన్ అప్పుడప్పుడు కాల్ గర్ల్సని కలుస్తూండేవాడు. ఆయన వేశ్యావాటికకు వెళ్ళ లేదు. ఏ యువతిని కలుసుకుంటే—ఆ యువతి ఇంటికే వెళ్ళేవాడు. అందుకాయన శివరాజా సాయం తీసు కున్నాడు. అయితే శివరాజు మోసం చేస్తాడని ఊహించ లేదు.

ఒక సంవత్సరం క్రితం శివరాజా మధుసూదన్‌కి కొన్ని ఫోటోలు చూపించాడు. ఆ ఫోటోలలో మధుసూదన్, ఓ యువతి ఉన్నారు. వారిద్దరికీ శారీరక సంబంధమున్నదనడానికి తిరుగులేని ఋజువా ఫోటోలు.

"ఏమిటీ ఫోటోలు?" అన్నాడు మధుసూదన్.

"మీ యిద్దరికీ అయిదేళ్ళ క్రితం సంబంధమేర్పడింది. ఈమె పేరు చరిత. ఈమె కిప్పుడు నాలుగు సంవత్సరాల కొడుకున్నాడు. ఆమెకు వేరే ఆధారమేమీ లేదు. నువ్వే తనని పెళ్ళిచేసుకుందుకు నిరాకరించేవట. అసహాయులకూ, అనాథలకూ, ఆడపిల్లలకూ నేనెప్పుడూ సాయపడతాను-" అన్నాడు శివరాజా.

"ఈమె నన్ను పెళ్ళి చేసుకోమని అడగలేదు...."

"ఇప్పుడడుగుతోంది...."

"అప్పుడే అడగాల్సింది. నేనామె జోలికి వెళ్ళి ఉండేవాణ్ని కాదు..."

"ఈ ఫోటోలు మీ యిద్దరికీ పెళ్ళిచేస్తాయి...."

మధుసూదన్ ఒప్పుకోలేదు.

"లేకపోతే నెలకు వెయ్యిరూపాయలు—ఆమెకు భరణంగా యిచ్చుకో—"

మధుసూదన్ అందుకూ అంగీకరించలేదు.

"అయితే మనం కోర్టులో కలుసుకుంటాం...."

మధుసూదన్ ఈ విషయం గొడవగా మారుతుందని భయపడ్డాడు.

"అవ్వాకావాలి, బువ్వాకావాలంటే ఎలా కుదురుతుంది?" అని విసుక్కున్నాడు శివరాజు.

"నేను పేదవాణ్ని. నెల నెలా డబ్బిచ్చుకోలేను—"

"పోనీ ఒక్కసారి యాభై వేలిచ్చుకోగలవా?"

"యూరైవేలా?" మధుసూదన్ చంపక భవిష్యత్తు గురించి ఆలోచించాడు.

"అంతకంటే ఎక్కువే వస్తుందామె కోర్టుకి వెడితే!"

"ఆలోచించుకుందుకు వ్యవధి కావాలి...." అన్నాడు మధుసూదన్.

"వారంరోజులు గడువు. గుర్తుంచుకో — వారం రోజులే!"

మధుసూదన్‌కి చరిత యిల్లు గుర్తుంది. అతడు ముందామెను కలుసుకున్నాడు. ఆమెను నానామాటలూ అన్నాడు.

చరిత మౌనంగా అన్నీ విని — "శివరాజు మీద కోపాన్ని మీరు నా మీద చూపిస్తున్నారు—" అంది.

"నీ స్వార్థమే శివరాజునింతగా పురిగొల్పింది... "

"నా స్వార్థం సంగతి మరిచిపోండి. శివరాజుని మీరేం చేయగలరు?"

"నేను వాడినేం చేయగలను? అసహాయుణ్ని...."

"మగాడిగా మీరు అసహాయులు. అదీ శివరాజు గొప్పతనం. నేను ఆడదాన్ని. నా అసహాయతను గుర్తించరేం?" అంది చరిత.

అంతవరకూ మధుసూదన్ విషయాన్ని ఆ కోణం నుంచి చూడలేదు.

"ఇందులో నీ అసహాయత ఏముంది?"

"పదేళ్ళప్పుడు శివరాజు నన్ను నా కుటుంబం నుంచి దూరం చేశాడు. ప్రయివేటుగా చదువు చెప్పించాడు. పదహారేళ్ళు రాగానే నా వయసును పెద్ద మనుషులపై ప్రయోగించసాగాడు. ఓ కంపెనీలో స్టెనోగా నాకుద్యోగమిప్పించాడు. ఇప్పుడు నాకు పాతికేళ్ళు. నేను

అందరికిలా హాయిగా జీవించాలనుకుంటున్నాను. శివరాజందు కంగీకరించలేదు.

మిమ్మల్ని నేను మోసం చేయను. నాకు పిల్లలు లేరు. నాలుగేళ్ళ కొడుకని శివరాజంటున్నది ఎవరో కూడా నాకు తెలియదు. కానీ అలాంటి పత్రాణ్ని తెచ్చి— నా కొడుకని శివరాజు చెప్పమంటే చెప్పేస్తాను. మీరు నన్ను మోసం చేశారని చెప్పమంటే చెప్పేస్తాను. శివరాజుని నేనెదిరించలేను. మనమంతా ఈ సృష్టిలో భగవంతుడాడించే ఆటబొమ్మలం. నేను శివరాజు చేతిలో ఆటబొమ్మని"—అని చెప్పింది చరిత.

మధుసూదన్‌కామె పరిస్థితి అర్థమయింది. తన నుంచి డబ్బు కోరుతున్నది శివరాజే కానీ చరిత కాదు. కానీ ఏమిటి చేయడం?

తనే శివరాజుని చంపేయాలని అతడనుకున్నాడు. అందువల్ల తనకు తాత్కాలికంగా ప్రమాదం తప్పుతుంది. చరితకు కూడా మేలు జరుగుతుంది.

కానీ చంప?

చంప జీవితంలో స్థిరపడాలి. ఆమె సుఖంగా కాపురం చేసుకుంటూంటే అది తను కళ్ళారా చూసి సంతోషించాలి. తను శివరాజును చంపితే—పట్టుబడి ఉరికంబమెక్కితే—చంప ఏమైపోతుంది?

"శివరాజు పాపాత్ముడు. దుర్మార్గుడు. వాడినేదో ఒకరోజున ఎవరో ఒకరు చంపకపోరు. అంతవరకూ వేచి ఉండడం మినహాగా నేను చేయగలిగిందీ లేదు—" అనుకుని ఊరుకున్నాడు మధుసూదన్. అప్పట్నించీ నెల నెలా శివరాజు కాయన వెయ్యిరూపాయలు సమర్పించుకుంటున్నాడు.

"ఇదంతా నీకలా తెలిసింది?" అన్నాడు ప్రవీణ్.

"తెలియడంలో ఆశ్చర్యమేముంది?" అంది చంప.

"ఆశ్చర్యమే! నీ బాబాయి నీకిలాంటి కథ చెబుతాడనుకోను—"

"నాకీ కథ బాబాయి చెప్పలేదు—"

"మరెవరు చెప్పారు?"

"ప్రస్తుతానికి చెప్పలేను...." అంది చంప.

ప్రవీణ్ ఆమెనింకేమీ అడగలేదు. తను లేచి నిలబడి "నా ప్రేమను నిరూపించుకుంటాను. శివరాజును చంపేస్తాను—" అన్నాడతడు.

2

"మెనీ మెనీ థాంక్స్ చంపా!" అంటూ వెనక్కువాలాడు సోఫాలో విజయ్.

"నాకు థాంక్స్ చెప్పి లాభంలేదు. నీ అదృష్టం బాగుండాలంతే—" అంది చంప.

"నీవు నా తరఫున కృషి చేయడమే నా అదృష్టం. ఇంకా వేరే అదృష్టమేముంది!" అన్నాడు విజయ్.

చంప సాలోచనగా— "పాపం—నీ కారణంగా నేను ప్రవీణ్ కన్యాయం చేస్తున్నానేమో ననిపిస్తోంది-" అంది.

"డియర్ చంపా! ఇలాంటి సున్నిత మనస్తత్వం ఆడదానికి తగదు. ఆడదాని అందమంతా స్వార్థంలో ఉంది. తనకోసం తనవారి కోసం ఏమైనా చేయగల ఆడది— ఏ కుటుంబ విజయానికైనా మూలకారణం...."

"నిజమేకావచ్చు. కానీ ." అంది చంప.

"డియర్ చంపా! నీలో పసితనం పోలేదు. కమాన్-గివ్ మీ యే స్వీట్ కిస్...." అన్నాడు విజయ్.

"ఇలా మాట్లాడితే నాకు నచ్చదని చెప్పాను—" అంది చంప లేచి నిలబడి.

"అయాం వెరీసారీ! నువ్వు అన్నింట్లోనూ మరీ స్ట్రిక్ట్. పెళ్ళయ్యేదాకా వాయిదా వెయ్యడానికి నా వల్ల కాకుండా ఉంది. ప్లీజ్, కాస్త మోడ్రన్‌గా మారు..." అన్నాడు విజయ్.

"నాకు సంప్రదాయమంటే ఇష్టం. పెళ్ళి అయ్యేదాకా నువ్వు నన్ను తాకనైనా తాకకూడదు. అంతే!" అంది చంప.

"నీ రూల్సన్నీ నాకు తెలుసులే. నాకు నిన్ను తాకే అదృష్టమెప్పటికి కలుగుతుందో?" అంటూ వాపోయాడు విజయ్.

"నీకు నేను సహకరిస్తున్నాను. అది తప్పో ఒప్పో నాకే తెలియదు—" అంది చంప.

"శివరాజులాంటి వాణ్ని అంతం చేయడం చాలా అవసరం. అందుకు నీకు బోలెడు పుణ్యం వస్తుంది...."

"నిజమే—మధుసూదన్ బాబాయి నేడిపించినవాడు బాగుపడడు...." అంది చంప.

"వాడు నీ బాబాయి నేకాదు, నన్నూ ఏడిపిస్తున్నాడు. నన్నేడిపించినవాడూ బాగుపడడు—" అన్నాడు విజయ్.

"బాబాయికీ నీకూ తేడా ఉంది...."

"ఎందుకుండదూ—ఆయన తండ్రిలాంటివాడు, నేను నీకు ప్రియుణ్ని. కాబోయే భర్తను...."

"నేను చెబుతున్నదా తేడా కాదు...."

"మరింకేమిటి?"

"బాబాయి చేసింది తప్పుకాదు. నువ్వు తప్పుచేశావు."

"నీ బాబాయిది తప్పుకానప్పుడు వాడి మాత్రం తప్పెందుకవుతుంది?"

"ఎందుకంటే—బాబాయి నా కోసం పెళ్ళి చేసుకో లేదు. తన సుఖంకోసం ఎవరితోటి అక్రమ సంబంధం ఏర్పరచుకోలేదు. న్యాయమైన పద్ధతిలో తన కోర్కె తీర్చుకున్నాడు ...."

"న్యాయమైన పద్ధతి...." అని వెటకారంగా నవ్వాడు విజయ్.

"అవును—నా అభిప్రాయంలో అది న్యాయమైన పద్ధతే ...కానీ నువ్వు స్మగ్లరుతో వ్యవహారంలో ఉండి - శివరాజా కెమేరాలో చిక్కడ్డావు. బాగా డబ్బు సంపాదించాలన్న అత్యాశ కాకపోతే నీకు స్మగ్లింగ్ అవసరమేమిటి?"

"పెళ్ళి చేసుకోనివాడికి వ్యభిచారంలాగే—డబ్బు కావాలనుకున్నవాడికి స్మగ్లింగ్ అవసరం. నువ్వు నన్ను ప్రేమించావంటే డబ్బును చూసి కాదా?"

చంప నిట్టూర్చి—"అదంతా చెప్పలేను. నాకు నువ్వంటే ఎంతో యిష్టం. నీ రూపురేఖలు, నీ నడక, నీ పర్సనాలిటీ—వాలో ఏదో సంచలనాన్ని కలిగిస్తుంది. నువ్వేం చేసినా వండ్రఫుల్ అనిపిస్తుంది. నాకు అడ్వెంచరస్ స్పిరిట్ ఉన్న మగాళ్ళంటే ఆకర్షణ అనుకుంటాను. అటుపైన నాకు వైభవోపేతంగా జీవించాలని ఉంది. బాబాయి నా కోసం డబ్బు నిలవేస్తూ నన్ను సింపుల్ గా పెంచాడు....ఇలా ఎన్నో కారణాలు జతపడ్డాయను కుంటాను " అంది.

"నిజం చెబుతున్నాను. నాకు నీ అందం, అవయవాల పొందిక నచ్చింది. రోజుకొక్కసారైనా నువ్వు నా

కలలో కొస్తావు—" అన్నాడు విజయ్.

"కలలోనైనా సరే నన్ను తాకితే నే నొప్పుకోను. గుర్తుంచుకో...."

"మరి నీకు అడ్వెంచరస్ స్పిరిట్ ఉంటే యిష్ట మన్నావు. ఇప్పుడే అడ్వెంచర్ చేయనా?"

"నీ కంతగా అడ్వెంచరస్ స్పిరిట్ ఉంటే—శివ రాజుని నువ్వే చంపొచ్చుగా-" అంది చంప.

"అయాం సారీ, చంపా!" అన్నాడు విజయ్ వెంటనే.

అతడికి తెలుసు. ప్రవీణ్ చంపను ప్రేమిస్తున్నాడు. చంప తనను ప్రేమిస్తోంది. శివరాజును హత్య చేయడానికి ప్రవీణ్‌ని పురమాయించడం ద్వారా—ఆమెకు రెండు ప్రయోజనాలు. ఒకటి శివరాజుని వదుల్చుకోవడం. రెండు ప్రవీణ్‌ని వదుల్చుకోవడం.

రెండో ప్రయోజనం గురించి చంప బాధపడుతోంది. ఒక అమాయకుడు ఉరికంబమెక్కడం ఆమె కిష్టంలేదు.

"విజయ్! నీ కంటే అడ్వెంచరస్ స్పిరిటున్న ప్రవీణ్—ఎందుకో నన్నాకర్షించలేకపోయాడు. అతణ్ని మన పని కుపయోగించుకున్నాక—ఎలాగో అలా కాపాడాలి—" అంది చంప.

"తప్పకుండా! ఇప్పుడే నేను నీకు మాటిస్తున్నాను-" అన్నాడు విజయ్. అయితే మాటమీద నిలబడాలన్న పట్టింపతడికి లేదని చంపకు అనుమానముంది.

3

రాత్రి తొమ్మిదిగంటలకు వంటాయన కోటయ్య మధుసూదన్‌కీ, చంపకూ భోజనం వడ్డించాడు.

"ఈ రోజు చాలా ఆలస్యంగా వచ్చేవమ్మా!" అన్నాడు మధుసూదన్ ఆప్యాయంగా.

"అనుకోకుండా ఆలస్యమైపోయింది—" అంది చంప.

"శ్యామలరావుగారింటికి వెళ్ళి టైపిన్‌స్టిట్యూట్‌కి ఫోన్ చేశాను. నువ్వు వెళ్ళిపోయావన్నారు...." అన్నాడు మధుసూదన్.

"సంగీతం స్కూలుకి ఫోన్ చేయలేదా?" అంది చంప నవ్వుతూ.

"లేదు. అక్కడంత సేపుండవని నాకు తెలుసు...."

"బాబాయ్—నీకు నా మీద నమ్మకంలేదా?"

"ఎందుకు లేదమ్మా? అందుకేకదా?— ఆలస్యంగా ఎందుకొచ్చావూ—అనడిగాను. ఏమయ్యావోనని కంగారు పడ్డాను...."

ఇద్దరూ భోజనాలు చేశాక మధుసూదన్ ఆమెను తన గదిలోకి పిలిచి—"నీతో ముఖ్య విషయం మాట్లాడా లమ్మా—" అన్నాడు.

"చెప్పు బాబాయ్-" అంది చంప.

"నేను విజయ్ గురించి వాకబు చేశాను. అతడు కాలాయి మనిషి. చాలా ప్రమాదకరమైన వ్యక్తి కూడా!"

చంప మాట్లాడలేదు.

"అనుభవంమీద చెబుతున్నాను. ఈ కళ్ళతో ప్రపంచాన్ని చూసి ఎన్నో తెలుసుకున్నాను. వయసు చాలా ప్రమాదకరమైనది. అందులోనూ ఆడపిల్ల వయసులో ఉన్నప్పుడు జాగ్రత్తగా ఉండాలి. నువ్వు తెరమీద నటుల్ని చూశావు. కానీ ఈ వయసులో నీ చుట్టూ తిరిగే వారందరూ మహానటులు. వారి నటన ఎంత గొప్పగా ఉంటుందంటే—వారి నిజ స్వరూపాన్ని కళ్ళారా చూసినా అది నిజంకాదని సరిపెట్టుకోవాలని పిస్తుంది. విజయ్ చాలా ప్రమాదకారి. నా మాట నమ్మ...."

"అయితే ఏం చేయను బాబాయ్?"

"నేను నీ కోసం వెతికి వెతికి ఎన్నుకున్న ప్రవీణ్ ని పెళ్ళి చేసుకో. అతడెంతో మంచివాడు. నిన్ను పువ్వుల్లో పెట్టి చూసుకుంటాడు. అతడి జీతం తక్కువ కావచ్చు' కానీ మనకున్న దాంతో హాయిగా బ్రతకొచ్చు. మీ యిద్దరూ సుఖంగా కాపురం చేసుకుంటూంటే చూస్తూ సంతోషించాలని నా కోరిక. అందుకే నేను నీ కతణ్ని పరిచయం చేశాను. నిర్ణయం నీకే వదిలి పెట్టాలని—అతడికి నా మనసులోని ఉద్దేశ్యం తెలియనివ్వలేదు. నువ్వు నా మాటకు విలువియ్య—" అన్నాడు మధుసూదన్.

"ప్రవీణ్ నర్థం చేసుకుందుకు ప్రయత్నిస్తున్నాను. నా అడ్వెంచరస్ స్పిరిట్ కీ అతడి మన స్తత్వానికీ సరిపోవడం లేదు...."

"పోనీ విజయ్ తో ఎలా సరిపోయిందో చెప్పు!"

చంప చెబుతూంటే ఆమె కళ్ళలో మెరుపు.

విజయ్ కు కారుంది. తనే ఆ కారును డ్రైవ్ చేస్తుంది. ఊళ్లో తనంత స్పీడుగా డ్రైవ్ చేసేవారు లేరని చెప్పుకోవాలి. విజయ్ కి దురలవాట్లున్నాయి. తానతడి చేత అవి మానిపించి అతణ్ణదుపులోకి తీసుకుంటుంది. విజయ్ నేరస్థులతో చేతులుకలిపి నేరాలు చేస్తున్నాడు. తను విజయ్ మనసు మార్చి నేరస్థులకు వ్యతిరేకంగా మారుస్తుంది. నేరస్థులతో శత్రుత్వం కారణంగా జీవితం నిండా అడ్వెంచర్....

విజయ్ నేరాలు చేస్తున్నా, దురలవాట్లకు గురైనా, స్వార్థ పరుడికిలా అగుపిస్తున్నా అతడి మనసు మంచిది. ఆ మంచితనది. అతడికి ప్రేమించే హృదయముంది. ఆ ప్రేమ తనది.

"ఇదంతా సినిమాల ప్రభావం. నిజజీవితంలో మనుషులు—సినిమా హీరోల్లా ఉండరు. సినిమా హీరోలే నిజజీవితంలో అలాగుండరు...."

"అమితాబ్ బచన్ హిట్ పిక్చర్సన్నింట్లోనో విజయ్ పేరు పెట్టుకున్నాడు. ఆ పేరు మంచితనాన్నీ, జయాన్నీ సూచిస్తుంది...." అంది చంప.

మధుసూదన్ నిట్టూర్చి—"సాఫీగా నడిచిపోతున్న నీ జీవితంలోకి నేరస్థుల నెందుకమ్మా ఆహ్వానిస్తావు?" అన్నాడు.

"బాబాయ్—పరిస్థితుల ప్రభావంవల్ల కొందరు నేరస్థు లవుతారు. అలాంటి పరిస్థితులే ఎదురైతే అందరూ నేరస్థులే అవుతారు ఉదాహరణకు ప్రవీణ్ నే తీసుకో. నన్ను తృప్తిపరచడంకోసం అతను హత్య చేయడానికైనా సిద్ధంగా ఉన్నాడు-" అంది చంప.

"నేను నమ్మను...."

"చరిత కథ అతడికి చెప్పాను. అతడు శివరాజును చంపుతానన్నాడు"

మధుసూదన్ ముఖం అదోలాగైపోయింది. అతడు నిట్టూర్చి- "నేనూ నేరస్థుణ్ణని గుర్తు చేస్తున్నావుకదూ!" అన్నాడు.

"విజయ్ నే నేరస్థుడనుకోని నేను నిన్ను నేరస్థుడని ఎందుకనుకుంటాను?"

"ఆ కథ నీదాకా రాకూడదని ఎంతో తాపత్రయ పడ్డాను. కానీ కుదరలేదు. విజయ్ నిన్ను నాకు వ్యతిరేకంగా మార్చాలని ఈ కథ నీకు చెప్పాడు తప్ప - అది మన సంబంధ బాంధవ్యాలమీద ఎలాంటి దెబ్బతీస్తుందో

పట్టించుకోలేదు. తండ్రీ కొడుకుళ్ళమధ్య-కొన్ని విషయాలు రహస్యంగా ఉంచడమే మంచిది...." అన్నాడు మధుసూదన్.

"అవన్నీ యిప్పుడెందుకు బాబాయ్! నేను చెబుతున్నదల్లా ప్రవీణ్ హత్యకు సిద్ధపడ్డాడని!" అంది చంప.

"శివరాజు చావడం నా కిష్టమే! కానీ ప్రవీణ్ హంతకుడు కావడం నా కిష్టంలేదు. నేనతణ్ని వెంటనే కలుసుకుంటాను...."

"బాబాయ్-ఎవరి వ్యక్తిత్వాలలోనూ జోక్యం చేసుకోకు. నువ్వు నేను చెప్పేదాకా ప్రవీణ్‌తో మాట్లాడితే నామీదొట్టే!" అంది చంప.

4

డ్రాయింగ్ రూంలో ఒక్కడూ కూర్చుని విడియోలో బ్లూ ఫిల్ము చూస్తున్నాడు శివరాజు. అతడి ముఖంలో ఉద్రేకం లేదు. ఆవేశంలేదు. చాలా తాపీగా చూస్తున్నాడతడు.

"సర్!" అన్న పిలుపు విని గుమ్మంవైపు చూశాడతడు.

శివరాజు గుమ్మానికెదురుగా కనబడుతున్నాడు. గుమ్మం దగ్గరున్న వాళ్ళకి విడియో కనబడదు.

విడియో చూస్తూనే—"ఏమిటి?" అన్నాడు శివరాజు.

గుమ్మందగ్గరున్న పనివాడు-"మీకోసం ఎవరో వచ్చారండి. లోపలకు పంపమంటారా?" అన్నాడు.

"పేరు?"

"ప్రవీణ్ ...."

"ఇదివరకెప్పుడైనా మనింటికొచ్చేడా?"

"లేదండి...."

"సరే - పంపించు-" అని రిమోట్ కంట్రోల్‌తో వీసీఆర్. టీవీ-ఆఫ్ చేశాడు శివరాజు.

కొద్ది క్షణాల్లో ప్రవీణ్ లోపలకు ప్రవేశించి శివ రాజుకు నమస్కరించాడు. శివరాజతడికి ఆసనం చూపిం చాడు.

ఇద్దరూ ఒకరికొకరు - ఎదురెదురుగా కూర్చున్నారు.

"మీ రెవరో నాకు తెలియదు—" అన్నాడు శివరాజు.

"మీరు నాకు తెలుసు—" అన్నాడు ప్రవీణ్.

"ఎలా తెలుసు?" కుతూహలంగా అడిగాడు శివరాజు.

"మీరు చాలామందిని బ్లాక్ మెయిల్ చేస్తున్నారు."

శివరాజు ముఖం గంభీరంగా మారిపోయింది — "ఎవరున్నవ్వు?" అన్నాడు తీవ్రంగా.

"చాలా సామాన్యుణ్ని. నా జీతం నెలకారొందలు."

"ఎందుకొచ్చావ్?"

"నిన్ను హెచ్చరించడానికి—" అన్నాడు ప్రవీణ్ తనూ సంభావనమార్చి.

శివరాజు నవ్వి—"నీ కంటే పెద్దవాళ్ళు నన్ను హెచ్చరించారు"— అన్నాడు.

"వాళ్ళకూ నాకూ తేడా ఉంది ...

"ఏమిటది...."

"నేను నీ శ్రేయోభిలాషిని...."

శివరాజు తెల్లబోయి — "శ్రేయోభిలాషివా?" అన్నాడు.

"అవును...."

"అయితే నువ్వు నాకు చెప్పదల్చుకున్న దేమిటి?"

"నీ ప్రాణాలు ప్రమాదంలో ఉన్నాయి...."

శివరాజు నవ్వి—"ప్రమాదాలకు నేను భయపడను. వాటితో ఆడుకుంటాను—" అన్నాడు.

"ప్రమాదాలతో ఆడుకోవడానికి బ్రతికుండాలి కదా!" అన్నాడు ప్రవీణ్.

"నన్ను చంపడం అంత సులభంకాదు...."

"ఉంగరపు రాయికి విషమంటించి షేక్‌హ్యాండ్ చేస్తే ఎవరు చంపారో ఎలా చంపారో తెలియకుండా ప్రాణాలు పోతాయి. అర్ధరాత్రిపూట నీ గదిలోకి విష సర్పాన్ని వదిలిపెడితే పాము కరిచిందనుకుంటారు తప్ప హత్య అనుకోరు....మనిషిని చంపాలంటే యిలా ఎన్నో ఉపాయాలున్నాయి...."

"అయితే ఏం చేయమంటావ్?"

"నీ పద్ధతి మార్చుకో. ఇంతవరకూ సంపాదించింది దాంతో తృప్తిపడు. ఇకమీదట ఎవరినీ బ్లాక్ మెయిల్ చేయక....సుఖంగా నువ్వు జీవించి పదిమందిని సుఖపడనీ—" అన్నాడు ప్రవీణ్.

"నువ్వు నన్ను బెదిరిస్తున్నావా?"

"లేదు—హితవు చెబుతున్నాను...."

"నీ హితవు పాటించకపోతే?"

"చచ్చిపోతావు "

"ఇప్పుడే ఈ క్షణంలో నేను నిన్ను చంపేస్తే...?"

"అప్పుడు నిన్ను నా స్నేహితుడు బ్లాక్ మెయిల్ చేస్తాడు. నువ్వు సంపాదించిన దానికి రెట్టింపు గుంజడం మొదలు పెడతాడు...."

"ఎక్కడున్నాడు నీ స్నేహితుడు?"

"నేను చెప్పను...."

"చెప్పకపోతే ఇప్పుడే చస్తావ్! బ్లాక్ మెయిలింగు సంగతి తర్వాత చూస్తాను "

"నన్ను చంపడం ద్వారా నీ చావును తప్పించుకోలేవు...."

"ఏం—నీ స్నేహితుడు పగతీర్చుకుంటాడా?"

"నా స్నేహితుడు హత్యలు చేయడు. నువ్వు చచ్చేలోగా నిన్ను బ్లాక్ మెయిల్ చేసి నీ దగ్గర డబ్బు గుంజుతాడు!"

"మరి నే నెలా చస్తాను?"

"ఎలా చస్తావో యిప్పుడు చెప్పను...."

"ఎప్పుడు చెబుతావు?"

"నీ దగ్గర లక్షరూపాయలు తీసుకుని...." అన్నాడు ప్రవీణ్.

"నువ్వడిగితే నేనిస్తాననుకున్నావా?"

"నిన్ను చంపడానికి ముగ్గురు ప్రయత్నిస్తున్నారు. ముగ్గురూ మూడు రకాలుగా ప్రయత్నిస్తున్నారు. వాళ్ళెవరో—ఏ విధంగా ప్రయత్నిస్తున్నారో నాకు తెలుసు. నా ద్వారా నువ్వూ తెలుసుకోవచ్చు. అందుకు లక్ష రూపాయల ఫీజు ఇవ్వదల్చుకుంటే యివ్వవచ్చు. లేదా మూడే మూడు రోజుల్లో నీకు చావు రాసి పెట్టి వుంది."

"నేను నీకు పైసా కూడా యివ్వను "

"అయితే బ్లాక్ మెయిలింగ్ మానెసేయ్. నీ చేత బ్లాక్ మెయిలింగ్ కాబడుతున్న వారందరికీ ఆ విషయం చెప్పేసేయ్. నీ ప్రాణాలు రక్షించబడతాయి. నిన్ను చంపాలనుకుంటున్న వారు ముగ్గురూ కూడా నీ బ్లాక్ మెయిల్ కు గురైనవారే! అయితే వాళ్ళు నియమించిన మనుషులెవ్వరో నీ ఊహాకు కూడా అందదు...."

"నీ కెలా తెలిసింది?"

"అనుకోకుండా తెలిసింది. సొమ్ము చేసుకోవాలను కుంటున్నాను...."

శివరాజా క్షణం ఆలోచించి—"నీకు నేను డబ్బిస్తాను. నీకు తెలిసిన ఆ రహస్యం నాకు చెప్పు...." అన్నాడు.

"ఇప్పుడు చెప్పను...." అన్నాడు ప్రవీణ్.

"ఎప్పుడు చెబుతావు? నా కింక మూడే రోజులు వ్యవధి ఉందన్నావు...."

"అర్ధరాత్రి ఒంటిగంటకు—నీ యింటికి దగ్గర్లోని—నెహ్రూపార్కులో—నల్లగులాబి పొదలో లక్ష రూపాయలనూ—ఓ సంచీలో పెట్టి—ఉంచేయ్ ఆ తర్వాత ఆ ప్రాంతాల నువ్వుగానీ నీ మనుషులుగానీ ఉండకూడదు. ఇంటికి చేరేసరికి నీకు కావలసిన సమాచారం అందుతుంది—"

"అందకపోతే?"

"నా చిరునామా నీకు తెలుసు. నేను సామాన్యుణ్ని. నా పని పట్టడం నీ కసాధ్యంకాదు... "

"నీ చిరునామా నాకు తెలియదు ..."

"తెలుసంటే—నేను చెబుతానని అర్థం...."

ప్రవీణ్ శివరాజుకు తన చిరునామా యిచ్చాడు. శివరాజా నోట్ చేసుకుని జేబులో ఉంచుకున్నాడు.

"మరి—నాకు సెలవా?" అంటూ లేచాడు ప్రవీణ్.

శివరాజా తలాడించాడు.

5

థియేటర్లో జనం పల్చగా ఉన్నారు.

బాగా వెనకగా కూర్చుని ఉన్నారు ప్రవీణ్, చంప.

"శివరాజా మనుషులు నిన్ననుసరించి కనిపెడుతూంటా

లేమో—నీకు భయంగా లేదా?" అంది చంప.

"శివరాజు బ్లాక్ మెయిలర్. అలాంటివారికి అనుచరు లుండరు. ఒక్కడే పనిచేస్తాడు...."

"అయితే నీకు లక్షరూపాయలూ ఇస్తాడంటావా?"

"ఇస్తాడు...."

"ఇవ్వకపోతే?"

"ఇచ్చినా యివ్వకపోయినా—చస్తాడు—"

"ఎలా?"

"గులాబిపొదలో అతడికోసం విషనాగు—సిద్ధంగా ఉంటుంది. డబ్బుసంచీ పెట్టగానే కాటేస్తుందది...."

"పాము బుద్ధిగా ఆ పొదలోనే కూర్చుంటుందను కున్నావా?"

"అందుకు పద్ధతులున్నాయి. ఎవరైనా కదిపితే తప్ప చలనముండదు దానిలో."

చంప అతడివంక ఆశ్చర్యంగా చూసి— "నేరస్థుడిగా నువ్వు బాగా రాణిస్తావు. నీ గురించి ఏమో అను కున్నాను—" అంది.

"నేనేం చేసినా—అది నీ కోసమే...." అన్నాడు ప్రవీణ్.

"నేను నిన్ను మోసం చేస్తున్నాననుకో—అప్పుడు?" అడిగింది చంప.

"నేను నీ గురించాలోచించను. నా కోసమే నా ఆలోచనంతా. నాకు నువ్వు కావాలి....ఎలాంటి దాని వైనా సరే!"

"హత్యచేసి పట్టుబడితే నేను నీకు కాకుండా పోతాను. అందుకూ సిద్ధపడే ఉన్నావా?"

"నేను హత్యచేసి పట్టుబడను...."

"ఒకవేళ నేను నిన్ను పట్టిస్తే!"

"ఏం చేస్తానో తెలియదు కానీ నిన్ను ద్వేషించను."

చంప అతిడికంక ఆశ్చర్యంగా చూసింది— "నేనంటే నీకెందుకూ—అంతిష్టం!" అనడిగిందామె.

"నువ్వడిగావు కాబట్టి నీ ప్రశ్నకు—జవాబు తెలుసుకుందుకు ప్రయత్నిస్తాను—" అన్నాడు ప్రవీణ్.

"ఒక్క నిముషం—నేను బయటకు వెళ్ళొస్తాను—" అంది చంప.

"ఏం చేస్తాను? నువ్వొచ్చేదాకా సినిమా చూస్తూంటాను—" అన్నాడు ప్రవీణ్ నిరుత్సాహంగా.

చంప బయటకు వెళ్ళి—థియేటర్ మేనేజర్నొకసారి ఫోన్ కావాలనడిగింది. అందమైన అమ్మాయికి ఫోన్ ఏమిటి? ఏమైనా యిచ్చి సహకరిస్తారెవరైనా?

మేనేజరామె ప్రయివేటుగా మాట్లాడుకుందుకు వీలుగా గదిలోంచి బయటకూడా వెళ్ళిపోయాడు.

చంప విజయ్‌కి ఫోన్ చేసింది. విజయ్ వెంటనే లైనులోకి వచ్చాడు. స్వరం తగ్గించి ఆమె ప్రవీణ్ చెప్పిందంతా చెప్పింది.

"చాలా థాంక్స్...చంపా!" అన్నాడు విజయ్.

"ఇప్పుడు నువ్వేం చేస్తావు?"

"అటు శివరాజా, ఇటు ప్రవీణ్—ఇద్దరి అడ్డూ తొలగిస్తాను...."

"ప్రవీణ్‌ని పోలీసులు పట్టుకోరుకదూ!"

సమాధానంగా విజయ్ నవ్వాడు.

"నువ్వు నాకు సమాధానం కాదు...."

"ఒకే ఒరలో రెండు కత్తులిమడవని నువ్వు గుర్తుంచుకోవాలి—మైడియర్ చంపా!" అని ఫోన్ పెట్టేశాడు

విజయ్.

చంపకు కళ్ళు జలదరించింది.

ఆమె గది బయటకు వచ్చి మేనేజరుకు థాంక్స్ చెప్తుతుంది. తర్వాత హాల్లోకి వెళ్ళింది.

"క్షణం యుగంలా గడిచింది నాకు. ఇంతాలస్యం చేశావేం చంపా?" అన్నాడు ప్రవీణ్ దీనంగా.

"ఇప్పుడే యింత బాధపడుతున్నావు....హత్య చేయడంవల్ల నాకు దూరమైతే ఏం చేస్తావు?" అంది చంప నవ్వుతూ.

"నీకు దగ్గర కావాలని హత్య చేస్తున్న వాణ్ని.... హత్య చేసి నీకు దూరమవుతానని ఎలాగనుకున్నావు?" అన్నాడు ప్రవీణ్.

"నేను రిస్కు తప్పించుకోలేదు...."

"శివరాజాను చంపడం నేరంకాదు...."

"శివరాజాను చంపడం సులభంకాదు...."

"చంపా—ముందే చెప్పాను. నీ కోసం ఏమైనా చేయగలను...."

అతడి మాటలు చంప కేదోలాగనిపించాయి. ఒక అమాయకుణ్ని తానుగానీ అన్యాయం చేయడంలేదుగదా అనిపిస్తోందామెకు.

6

అర్ధరాత్రి ఒంటిగంటయింది.

శివరాజా విహారపార్కులో అడుగుపెట్టాడు.

అతడి భుజాన ఓ సంచీ వ్రేలాడుతోంది. ఆ సంచీ ఉబ్బెత్తుగా ఉంది.

శివరాజా తిన్నగా నల్లగులాబుల పాదవద్దకు చేరాడు.

ఆ సమయంలో పార్కు నిర్మానుష్యంగా ఉండ

డంలో ఆశ్చర్యంలేదు. అయినా శివరాజో సారి చుట్టూ చూశాడు.

అతడికి ప్రాణభయంలేదు.

అతడు చనిపోయిన మరుక్షణం—ఎందరో పెద్ద మనుషుల గుట్టు బయటపడుతుంది. అందువల్లనే ఏర్పాటతడు ముందే చేసుకున్నాడు. అతడి స్నేహితుడొకడి వద్ద లాకర్ కీ ఉంది. శివరాజు బ్లాక్ మెయిలింగ్ వ్యవహారాల ఒరిజినల్సన్నీ ఆ లాకర్లో ఉన్నాయి. ఆ లాకర్ కీ శివరాజు స్నేహితుడివద్ద ఉంది. లాకర్ శివరాజు పేరుంది.

శివరాజు చావగానే ఆ స్నేహితుడా లాకర్ కీ పోలీసుల కందజేస్తాడు. పోలీసులు పెద్ద మనుషుల గుట్టు తెలుసుకుంటారు. అందుకే ఎందరో పెద్ద మనుషులు శివరాజువల్ల నష్టపోతూ అతడి ప్రాణాలు కాపాడాలని కూడా అనుకుంటూంటారు.

శివరాజు స్నేహితుదెవరో తెలుసుకోవాలని చాలా మంది ప్రయత్నించారు. సాధ్యపడలేదు. శివరాజుకు లాకరెక్కడుందో తెలుసుకోవాలన్న వారి ప్రయత్నాలూ విఫలమయ్యాయి. శివరాజుకు నాలుగైదు బ్యాంకుల్లో నాలుగైదు పేర్లతో అకౌంట్సున్నాయి. లాకర్సున్నాయి. ఆ విషయం చాలామందికి తెలియదు.

శివరాజు కనుక మరణిస్తే అందుకు సరైన కారణం నిరూపించబడాలి. అతడు హత్య చేయబడితే—హంతకుణ్ణి పట్టడానికి పెద్ద మనుషులందరూ కృషి చేయాలి. తను బ్లాక్ మెయిల్ చేస్తున్న వారి జాబితా శివరాజు స్నేహితుడి దగ్గరుంది. హంతకుడా జాబితాలో ఎవరికీ సంబంధించినవాడు కాకపోతే — హత్యకు సరైన ప్రత్యేకమైన కారణమేదైనా ఉంటే శివరాజు స్నేహి

తుడు లాకరు తాళాన్ని పోలీసుల కందించకుండా—తనే శివరాజుకు వారసుడై ఆ లాకర్లోని వస్తువులు తీసుకో గలడు. అతడు మంచివాడు. శివరాజు బ్లాక్ మెయిలరని కూడా అతడికి తెలియదు. తనవద్దున్న లాకరు కీ, పేర్ల జాబితా చరిత్ర అతడికి తెలియదు.

తన భుజాన సంచీ తీసి గులాబుల పొదలో వేశాడు శివరాజు. ఆ వెనువెంటనే అతిడికి బుస్సుమన్న శబ్దం విన పడింది. శివరాజు కంగారుపడ్డాడు కానీ సమయం మించి పోయింది.

కాళ్ళమీద ఏదో గీరుకున్న అనుభూతి, ఆ వెను వెంటనే ఒళ్ళంతా భరించలేని బాధ.

శివరాజు నేలమీద చర చరా పాకిపోతున్న విష నాగును చూశాడు. ఎందరినో గడగడలాడించిన అతడు తన్ను కాటేసిన విషనాగును ఏమీ చేయలేని అసహాయు డయ్యాడు.

పాము చర చర పాకిపోతూంటే అతడు విరుచుకుని వెనక్కి పడిపోయాడు.

7

ప్రవీణ్ మంచి నిద్రలో ఉన్నాడు.

ఆ సమయంలో ఎవరో తలుపులు దబదబ బాదు తున్నారు.

విసుగ్గా లేచాడతడు. అదే విసురుతో తలుపు తీశాడు. గుమ్మంబయట అతనెరుగని ఓ మనిషి. అతడి చేతిలో చిన్న సైజు తెల్లటి కవరు.

"చంపమ్మగారు-అర్జంటుగా మీకీ కవరిమ్మన్నారు" అంటూ ఆ కవరిచ్చి వెంటనే వెళ్ళిపోయాడతడు. కవరు చింపి ఉత్తరం తీశాడు ప్రవీణ్.

"ప్రవీణ్! నెహ్రూ పార్కులో శివరాజా
పాముకాటువల్ల మరణించాడు. పోలీసులు నీకోసం
బయల్దేరుతున్నారు. ఇంకేమీ ఆలోచించకు.
వెంటనే పారిపో! ఎక్కడికో అక్కడికి..పారిపో.
బ్రతికుంటే బలుసాకు తినొచ్చు. అదృష్టముంటే
మళ్ళీ కలుసుకోవచ్చు. ముందు నీ ప్రాణాలు
దక్కించుకో — నీ చంప."

ఇది చదివి తెల్లబోయాడు ప్రవీణ్. కానీ అతడు జాప్యం చేయలేదు. వెంటనే తన గదికి తాళంవేసి చంప యింటికి బయల్దేరాడు.

అతడామె యిల్లు చేరుకుందు కెంతో సేపు పట్టలేదు. కాలింగ్ బెల్ విని మధుసూదన్ తలుపుతీసి —"నువ్వా? ఈ సమయంలో వచ్చావేమిటి?" అన్నాడు.

"అర్జంటుగా చంపను కలుసుకోవాలి—" అన్నాడు ప్రవీణ్.

"ఇంత రాత్రిపూట వచ్చి పెళ్ళికాని ఆడపిల్లను కలుసుకుంటానంటున్నావు. దానికి సమాధానమేమిటో తెలుసా? గెటౌట్ ...."

"అయ్యా! నన్నపార్థం చేసుకోకండి. ఇది నాకు జీవన్మరణ సమస్య...." అన్నాడు ప్రవీణ్.

"లోపలకురా!" అన్నాడు మధుసూదన్. ప్రవీణ్ లోపలకు రాగానే అతడు తలుపువేసి ఆసనం చూపించాడు.

ఇద్దరూ ఒకరికొకరెదురుగా కూర్చున్నాక —"ఒక ఆడపిల్లను పెళ్ళికాకుండా నీబోటివాడిలా కలుసుకుందుకు వస్తే ఆడామెకు జీవన్మరణ సమస్య—నీకాదు—" అన్నాడు మధుసూదన్.

"అయితే మూడో ఉత్తరం చూడండి—" అన్నాడు ప్రవీణ్ తన చేతులోని కాగితాన్నతడి కందిస్తూ.

మధుసూదన్ ఆ ఉత్తరం చదివి—"శివరాజు చచ్చిపోయాడా—నిజంగానా?" అన్నాడు.

"ఏమో—నాకు తెలియదు.... ఈ ఉత్తరం ఓ అరగంట క్రితం చంప నాకు పంపింది-" అన్నాడు ప్రవీణ్.

మధుసూదన్ రిస్టువాచీ చూసుకున్నాడు. టైము రెండు దాటింది.

"చంప తొమ్మిదింటికల్లా నిద్రపోయింది. ఇంతవరకూ లేవలేదు. నువ్వేదో దాస్తున్నావు. మొత్తం జరిగినదంతా చెప్పు...."

"చెప్పడానికేం లేదు. నేనర్జంటుగా చంపను కలుసుకోవాలి...."

మధుసూదన్ విసుగ్గా "శివరాజు నెహ్రూపార్కులో పాము కాటువల్ల చనిపోతే—పోలీసులు నీకోసమెందుకు వెతకాలి?" అన్నాడు.

"ఒక్కసారి చంపను పిలవండి...."

"పిలవను. విషయమంతా నువ్వు నాకు చెప్పాలి...."

ప్రవీణ్ తప్పించుకోవాలని చూశాడు కానీ సాధ్యపడలేదు. చివరికతడు చంప తనను శివరాజును హత్య చేయడానికి ప్రోత్సహించినట్లు చెప్పాడు.

మధుసూదన్ చలించకుండా—"మగాడివి. దానికంటే విచక్షణ వున్నవాడివి. అది చెప్పినట్లల్లా చేస్తే నీ గతే కాదు.... దాని గతేం కాను.... రేపొద్దున్న అది ప్రధాన మంత్రిని హత్య చేయమంటుంది. చేసేస్తావా?" అన్నాడు.

"నేనామె చెప్పినట్లల్లా చేయడంవల్ల నాకు నష్టం. ఆమెకేం నష్టం?" అన్నాడు ప్రవీణ్ ఆశ్చర్యంగా.

"బాగుంది. నేను మీ యిద్దరికీ పెళ్ళి చేయాలనుకుం టున్నాను...."

ప్రవీణ్ ఆశ్చర్యంగా—"కానీ—మీకు తెలివాళ్ళంటే అపనమ్మకం. అసహ్యం. నేను తెలివాడినని మీకు తెలుసు..." అంది.

"ఇలాగని ఎవరు చెప్పారు?"

"చంప ..."

మధుసూదన్ క్షణకాలం ఆశ్చర్యపోయాడు-"చంప నీకు అబద్ధం చెప్పింది—"

"ఆ అబద్ధమెందుకు చెబుతుంది?"

"ఆమె విజయ్‌ని ప్రేమిస్తుందిలే!"

"విజయ్ ఎవరు?"

"డబ్బున్న ఓ జులాయి వెధవ.... చంపకు వాడంటే ప్రాణం. నాకు వాడంటే అసహ్యం. అందుకే త్వరగా మీ యిద్దరికీ పెళ్ళి చేయాలని నేననుకుంటున్నాను. నువ్వేమో వాడికంటే జులాయిగా తయారై హత్యలకు పాల్పడుతున్నావు. ఇప్పుడు నీకంటే వాడే నయమని పిస్తోంది."

ప్రవీణ్ చటుక్కున—"మీరు నన్ను తప్పుగా అర్థం చేసుకున్నారు. నేను హత్య చేస్తానని చంపకు చెప్పాను కానీ శివరాజును హత్య చేయాలనుకోలేదు.." అన్నాడు.

"మరేం చేద్దామనుకున్నావు....?"

"అతడినుంచి ఎలాగో బెదిరించి ఓ లక్షరూపాయలు సంపాదించి ఆ డబ్బుమీద వచ్చే వడ్డీతో మీ బ్లాక్ మెయిలింగు ఖర్చు సరిపెట్టాలనుకున్నాను."

"శివరాజంత తెలివితక్కువవాడా?"

"కాదు. కానీ నా తెలివి ఉపయోగించాలను

టున్నాను."

"ఏం చేశావు?"

చెప్పాడు ప్రవీణ్.

"అయితే శివరాజా లక్షరూపాయలూ తెచ్చి ఉంటా డంటావా?"

"తెస్తాడని నాకు నమ్మకంలేదు. తెల్లవారుఝామున వెళ్ళి చూడాలనుకున్నాను. ఆ తర్వాత శివరాజాను నమ్మించడానికీ బెదిరించడానికీ—ఇంకా పెద్ద నాటకం తయారు చేసుకున్నాను. కానీ యీలోగానే యీ కబు రందింది."

"అయితే శివరాజు అనకోకుండా పాముకాటుకు గురై వుంటాడు. కానీ పోలీసులు నీకోసం యెందుకు వెతుకు తారు? శివరాజు ముందుగా పోలీసులకు చెప్పాడం టావా?" అన్నాడు మధుసూదన్.

"కాదు. ఎక్కడో ఏదో మోసం జరిగింది—"

"అంటే?"

"నేను నల్లగులాబి పొదలో పామునుంచుతానని చంపతో చెప్పాను. కానీ నాకలాంటి ఉద్దేశ్యమేంలేదు. అసలు శివరాజలా అక్కడికి వస్తున్నట్లూ, అతణ్ని నేను పాము కాటుద్వారా చంపబోతున్నట్లూ నాకూ, చంపకూ తప్పక ఎవరికీ తెలియదు. నా పథకం మరో కళ్ళకి ఎలా తెలిసింది?" అన్నాడు ప్రవీణ్—"అందుకే అర్జంటుగా చంపను కలుసుకుని మాట్లాడాలను కుంటున్నాను...."

"శివరాజు మరణం విజయ్‌కు లాభిస్తుంది. చంప విజయ్‌ని ప్రేమిస్తోంది. ఇంతే నేను చెప్పగలను...." అన్నాడు మధుసూదన్.

ప్రవీణ్ తెల్లబోయి— "అయితే—చంప నన్ను పోలీసులకప్పగిస్తుందంటారా- నేను నమ్మను..." అన్నాడు.

"ఈ ఉత్తరం నీకు చంప పంపలేదు. బహుశా విజయ్ పంపి ఉండవచ్చు. నీ పథకాన్నతడుపయోగించుకుని శివరాజు ప్రాణాలు తీసివుండవచ్చు. పోలీసులకు నీ పేరు చెప్పొచ్చు. నువ్విప్పుడు పరారీ అయ్యావంటే నీమీద అనుమానం పెరుగుతుంది. నా మాట విని పోలీసులకు లొంగిపో—" అన్నాడు మధుసూదన్.

ప్రవీణ్ చటుక్కున వంగి మధుసూదన్ పాదాలకు నమస్కరించి—"నాకు మీ ఆశీర్వాదం కావాలి. మీరు చెప్పినట్లే చేస్తాను...." అన్నాడు.

"కళ్యాణమస్తు—" అన్నాడు మధుసూదన్.

8

ఇంకా తెల్లవారకుండానే తనింటికి వచ్చిన విజయ్‌ను చూసి తెల్లబోయింది చంప.

అప్పటికి మధుసూదన్ గాఢనిద్రలో వున్నాడు. చంప ముఖం కడుక్కుని కాఫీ తాగుతోంది. వంటాయన విజయ్‌కి కూడా కాఫీ తెచ్చిచ్చాడు.

"అనుకోని ప్రమాదం జరిగింది. ప్రవీణ్ నా ప్రాణం మీదకు తీసుకొచ్చాడు...." అన్నాడు విజయ్.

"ఏం జరిగింది?"

"ప్రవీణ్ పథకాన్ని నేనుపయోగించుకున్నాను. శివరాజు పాము కాటువల్ల మరణించాడు. నేను పోలీసులకు ఫోన్ చేసి ప్రవీణ్ ఒక పాములవాడి దగ్గర పాము కొని—శివరాజును హత్య చేసినట్లు — అజ్ఞాత వ్యక్తిగా చెప్పాను. పాములవాడిచేత ఇప్పుడు సాక్ష్యం కూడా సిద్ధం చేశాను. ఆ తర్వాత ప్రవీణ్‌ని పారిపొమ్మని

హెచ్చరిస్తూ ఉత్తరం రాశాను. ప్రవీణ్ పారిపోకుండా పోలీసుల్ని కలుసుకున్నాడు. జరిగింది తనకు తెలిసినంత వరకూ యథాతథంగా చెప్పేశాడు...."

"శివరాజు పాము కాటువల్ల చనిపోగానే తృప్తిపడి ఊరుకోక అందులో మళ్ళీ ప్రవీణ్ నెందుకిరికించావు?" అంది చంప కోపంగా.

విజయ్ ఆమెకు శివరాజు స్నేహితుడి గురించి చెప్పి- "హత్య ప్రవీణ్ వల్ల జరిగితే మా ఇద్దరికీ ప్రమాద ముండదు. లేకుంటే నేనతన్నెప్పుడో చంపించి వుండే వాణ్ని...." అన్నాడు.

"కానీ ప్రవీణ్ నింగులో ఇరికించడం అన్యాయం.."

"అన్యాయమే కానీ—స్వార్థం కోసం కొన్ని అన్యాయాలు తప్పవు. ఒక ఒరలో రెండు కత్తులిమడవవి నీకెప్పుడో చెప్పాను. నువ్వు లేకుండా ప్రవీణ్ ఎలాగూ జీవించలేడు. నీ ప్రియుణ్ని రక్షించడంవల్ల అతడికెంతో తృప్తిగా వుంటుంది."

చంప నిట్టూర్చి—"ఇప్పుడీ సమయంలో ఇలా ఎందుకొచ్చావ్?" అంది,

"నిన్న రోజంతా నేను నీతో ఉన్నట్లు నువ్వు పోలీసులకు చెప్పాలి. మనం కాబోయే దంపతులమని నేను పోలీసులక్కూడా చెబుతాను. నీ సాక్ష్యముంటేగాని నాకు ఎలిబీ ఇవ్వగలదు."

"నీకు ఎలిబీ అంటే—అది ప్రవీణ్ కి ప్రాణాంతకం-అవునా?" అంది చంప తీవ్రంగా.

"అవును ..."

"హంతకుడికి రక్షణ ఇచ్చి—అమాయకుణ్ని శిక్షించ

డానికి నీకు నా సాక్ష్యం కావాలి....అవునా?"

"అవును—"

"ఇది నావల్ల కాదు...."

"నీ సాక్ష్యం లేకపోతే నేను నీకు దక్కను....నిన్నే నమ్ముకున్నాను. నా ప్రాణాలు రక్షించుకో. సతీసావిత్రి పెళ్ళయ్యాక భర్త ప్రాణాలు రక్షించుకుంది. నీవు పెళ్ళికి ముందే భర్త ప్రాణాలు రక్షించుకుని ఆమెకంటే ఓ మెట్టు పైకెక్కు....ఇక నేను నా యింటికి వెడుతున్నాను.... నేను చెప్పింది గుర్తుంచుకో...." అనేసి హడావుడిగా వెళ్ళిపోయాడు విజయ్.

చంప అతడికి వీడ్కోలు కూడా చెప్పలేదు. ఆమె మనసులో తీవ్ర సంచలనం ఆరంభమయింది.

"నేనిప్పుడేం చేయాలి?"

ఆలోచిస్తూ కుర్చీలో వెనక్కువాలి కళ్ళు మూసుకుందామె. అలా ఎంతసేపుందో తనకే తెలియదు. నిద్ర పోతున్నావా—అన్న మధుసూదన్ పలకరింపుతో—ఆమె ఉలిక్కిపడి కళ్ళు తెరిచి—"లేదు బాబాయ్!" అంది.

మధుసూదన్ ఆమె ఎదురుగా కూర్చుని—"నువ్వు చేసిన పనేం బాగోలేదమ్మా—ఒక రాత్రివేళ ప్రవీణ్ వచ్చాడు—" అంటూ జరిగింది చెప్పాడు.

"అంటే అతడికి నేను విజయ్‌ని ప్రేమిస్తున్నానని తెలిసిపోయిందన్నమాట...." అంది చంప.

"నువ్వు విజయ్‌ని ప్రేమించడంలేదు. ప్రేమిస్తున్నాననుకుంటున్నావు—" సవరించాడు మధుసూదన్.

చంప మాట్లాడలేదు.

"ప్రవీణ్‌ని నువ్వే రక్షించాలి. నిన్న రోజంతా

అతడు నీతో నీ ఉన్నట్లు సాక్ష్యమివ్వాలి .... అదే అతడికి తిరుగులేని ఎలిబీ అవుతుంది...."

"ప్రవీణ్ కి ఎలిబీగా ఉంటే—విజయ్‌ని వురులుకో వడమే అవుతుంది—"

"హంతకుడి వురికంబం తగిన శిక్షే కదా!"

"బాబాయ్—శివరాజాను చంపడం నేరమంటావా?"

"మనిషి మనిషిని చంపడం నేరం. శివరాజా మనిషి కాదని నువ్వంటే సరిపోదు. చట్టం ఒప్పుకోవాలి. చట్టాన్ని నిరసిస్తే—అది దేశద్రోహం....శివరాజాను చంపకముందే విజయ్ దేశద్రోహి...." అన్నాడు మధుసూదన్.

"బాబాయ్—చిన్నప్పట్నించీ నీ చేతుల్లో నన్ను పెంచావు....కానీ నీ దురదృష్టమో నా దురదృష్టమో! నేను నీ ఆత్మీయత సరం చేసుకోగలను. నిన్నభిమానించ గలను. కానీ నీ అభిప్రాయాలు వేరు. నా అభిప్రాయాలు వేరు. ఇది నాకు బాధగానే వుంది. అయినా నిజం!" అంది చంప.

"అయితే ప్రవీణ్‌కి ఎలిబీ యివ్వవా?"

"ప్రవీణ్ కిచ్చినా, విజయ్‌కిచ్చినా ఎలిబీ యివ్వడమంటే—అబద్ధమే అవుతుంది. అంటే నేను తప్పు చేస్తున్నాను. నువ్వు నన్ను తప్పుకు ప్రోత్సహిస్తున్నావు. తప్పు చేసేటప్పుడు నాకు ప్రయోజనకరంగా ఉండే అబద్ధమెందుకు చెప్పకూడదు?"

"అయితే నీ నిర్ణయమేమిటి?"

"నేను విజయ్‌కి ఎలిబీ యిస్తున్నాను...."

"విజయ్ కా?"

"అవును. విజయ్ కే!"

మధుసూదన్ ముఖం ఎర్రబడింది—"అయితే నేను నీ ఎలిబీని ఖండిస్తాను. విజయ్ స్థానంలో ప్రవీణ్ ఉన్నాడంటాను...." అన్నాడతడు.

చంప తెల్లబోయింది.

9

కోర్టులో కేసు ప్రవీణ్ కి బలంగా తయారయింది.

ప్రవీణ్ కీ, శివరాజుకీ మధ్య జరిగిన సంభాషణ తను విన్నట్లు శివరాజు పనివాడు చెప్పాడు. ఆ సంభాషణ నిజమేనని ప్రవీణ్ ఒప్పుకున్నాడు.

ప్రవీణ్ కి తనో పెంపుడు పామును వందరూపాయలకు అమ్మినట్లు పాములవాడు సాక్ష్యమిచ్చాడు. ప్రవీణ్ కాదని ఎంతగా ఆక్రోశించినా ఎవరూ పట్టించుకోలేదు. పాములవాడు చెప్పే సమయంలో తను చంపతో పాటు థియేటర్లో ఉన్నట్లతడు చెబితే—చంప—తనూ విజయ్ ఉన్నట్లు చెప్పింది. మధుసూదన్ ఎందుకో ఆమె మాటలు ఖండించలేదు. ఆ విధంగా విజయ్ కు పూర్తి ఎలిబీ వుంది.

ప్రవీణ్ కి ఎలిబీ లేదు. అతడు చెబుతున్నదంతా కట్టుకథలాగుంది. కోర్టులో అతడి మాట ఒక్కటీ నిలబడలేదు.

"నా మాట లెవరూ నమ్మడంలేదు. నాకు శివరాజును చంపాల్సిన అవసరమేమిటి?" అన్నాడు ప్రవీణ్.

"చంపకోసం...." అన్నది ప్రాసిక్యూషన్ లాయర్ జవాబు.

ప్రవీణ్ నిస్సహాయుడైపోయాడు. నిర్వీర్యుడైపోయాడు.

ఆ సమయంలో—ఓ కొత్తసాక్షి పుట్టుకువచ్చింది. ఆమె పేరు చరిత!

ప్రవీణ్ ఆ రోజంతా తనతో గడిపాడనీ—ఆ విషయం పదిమంది ముందరా బైటపెట్టడం అతడికిష్టం లేదనీ ఆమె చెప్పింది.

ఇటీవలే చరితకు వివాహం నిశ్చయమయింది. వరుడామె గత చరిత్రను పూర్తిగా తెలుసుకున్నాకనే వివాహానికి అంగీకరించాడు. అతడిది విశాల హృదయం.

ప్రవీణ్‌ని చరిత స్వంత తమ్ముడికిలా అభిమానిస్తోంది. అతడికీ ఆమెకూ విచిత్ర పరిస్థితుల్లో పరిచయమయింది. మనసు బాగోలేక ఆ రోజతడామె ఇంట్లోనే ఉన్నాడు. ఎంతటి విశాలహృదయుడైనా దీన్ని అపార్థం చేసుకో వచ్చని ప్రవీణ్ విషయం దాచిపెడుతున్నాడు. చంపనైతే తనెలాగూ వివాహం చేసుకుంటాడు కాబట్టి— ఆమెపై ఎటువంటి అపవాదూ ఉండదనుకుని ఆమె పేరు చెబుతున్నాడు. ఒక అమాయకుడి ప్రాణాన్ని ప్రమాదంలో వదిలిపెట్టలేక చరిత తానిప్పుడు ముందుకు వచ్చింది.

ప్రాసిక్యూషన్ లాయర్ ఈ సాక్ష్యాన్ని దారుణంగా పరిహసించాడు. అది ప్రవీణ్‌కి సహకరించడం కంటే— చరితకే అవమానకరంగా పరిణమించింది. ఆమె సాక్ష్యాన్ని ప్రవీణ్ కూడా అంగీకరించలేదు.

అప్పుడు మధుసూదన్ బోనెక్కాడు.

“చరితను వివాహం చేసుకోబోతున్నది నేనే! ఇప్పటికీ నేనామె సచ్ఛీలతను నమ్ముతున్నాను. మా ఇద్దరికీ వయోభేదం ఎక్కువే.... కానీ మా పరిచయం వయసూ ఎక్కువే.... ఇంతవరకూ ఆమె జీవితంలో అబద్ధం చెప్ప లేదు...”

ప్రాసిక్యూషన్ లాయర్ మధుసూదన్‌ని క్రాస్

ఎగ్జామిన్ చేస్తూ—"మీరు చంప వివాహం విజయ్‌తో కాక ప్రవీణ్‌తో జరగాలనుకుంటున్నారు. అందుకే ఈ ఇప్పుడు సాక్ష్యాలన్నీ సృష్టిస్తున్నారు. మీ సాక్ష్యం నిలబడదు. కానీ ఒక్క విషయం తెలుసుకోవాలనుకుంటున్నాను. మీరు విజయ్‌నెందుకు ద్వేషిస్తున్నారు?" అన్నాడు.

"విజయ్ దేశద్రోహి—" అన్నాడు మధుసూదన్.

"వివాహం చేసుకోకుండా ఓ అవివాహిత యువతితో అక్రమ సంబంధం పెట్టుకున్న మీకు విజయ్‌ని దేశద్రోహి అనే అర్హత వుందా?" అన్నాడు లాయర్.

"దేశద్రోహిని దేశద్రోహి అనడానికి అర్హతుండాలా?"

"అర్హత లేకపోతే—కనీసం సాక్ష్యముండాలి...."

"అయితే వినండి.... నేను చరితను పెళ్ళిచేసుకుందామని కొన్నేళ్ళ క్రితమే అనుకున్నాను. కానీ శివరాజ్ పెళ్ళికి ఒప్పుకోలేదు..."

"ఎందుకని?"

మధుసూదన్ శివరాజు కథ చెప్పి— "పదిమంది దృష్టిలో—ముఖ్యంగా సమాజంలో నేరాలు చేస్తూ పెద్ద మనుషులుగా చెలామణీ అవుతున్న వారి దృష్టిలో—నేనతడి శత్రువుగా పరిగణించబడాలని అతడి ఉద్దేశ్యం. కానీ అతడి లాకర్ తాళాన్ని దగ్గరుంచుకున్న అసహాయ స్నేహితుణ్ని నేనే! తను బ్రతికుండగా నేనీ విషయం బైటపెడితే నన్నూ, నా ప్రాణానికి ప్రాణంగా పెంచిన చంపనూ కాలరాస్తానని బెదిరించడంవల్ల ఇంత కాలం నోరెత్తలేకపోయాను. ఇప్పుడు నా కారణంగా

విజయ్‌ది మాత్రమేకాదు—ఎందరో పెద్దమనుషుల చరిత్రలు బైటపడతాయి.

విజయ్‌కి హత్యకు మోటివ్ వుంది. అతడు చంప ను ప్రయోగించుకుని శివరాజును తనదారి నుంచి తప్పించాలనుకున్నాడు. వెర్రి వ్యామోహంలోపడి చంప అతడికి సహకరిస్తోంది. నేను మీ కివ్వగల సాక్ష్యం - ఈ లాకర్ తాళం" — అంటూ ఓ తాళాన్ని లాయరు కందించాడు.

కోర్టులో పెద్ద సంచలనం...

ఆ తర్వాత ప్రవీణ్ బైటపడ్డానికీ—విజయ్‌కి శిక్ష పడ్డానికీ ఎంతో కాలం పట్టలేదు...

"విజయ్‌ని నేను ప్రేమిస్తున్నానని తెలిసీ నాకాకుండా చేసిన ప్రవీణ్ అంటే నేనింకా ఎందుకిష్టపడాలి!" అంది చంప బాబాయితో.

"అదే అతడి గొప్పతనం. అతడికి నిదానముంది. ఆ నిదానం నీ ఆవేశాన్ని సరిచేస్తుంది. నువ్వు హత్య చేయమన్నావు. అతడు నిదానించాడు. నువ్వు విజయ్‌ని తప్పు చేసినా రక్షించాలనుకున్నావు. తెలిసి తెలిసి అలాంటి వాడి బారికి నిన్నొదలడాని కతడిష్టపడలేదు. నీ సుఖం విజయ్ దగ్గర కాదు. ప్రవీణ్ దగ్గరుంది... నీ వతడి ప్రాణాలతో ఆడుకున్నావు. ఇంకా నిన్నతడు ప్రేమిస్తూంటే నువ్వతణ్ణే పెళ్ళి చేసుకో—" అన్నాడు మధుసూదన్.

చంప ప్రవీణ్‌ని కలుసుకుని క్షమించమని అడిగింది.

"నువ్వేం చేసినా భరిస్తాను. నువ్వు నన్ను చంపేస్తానంటే తలవంచుతాను. క్షమించమని మాత్రం అడక్కు. భరించలేను" అన్నాడు ప్రవీణ్.

40

చంప అతడి మాటలు విని కన్నీరు మున్నీరుగా ఏడ్చింది. ఆ ఏడుపు ఆమెలోని అడ్వెంచర్ స్పిరిట్‌ని కడిగేసి—సామాన్య యువతిగా మార్చింది. ఆ స్పిరిట్ తప్పుదారి పడితే ఏమవుతుందో విజయ్ ద్వారా ఆమెకు తెలిసింది.

కొంతకాలానికి మధుసూదన్ చరితను వివాహం చేసుకున్నాడు. ఆ దంపతుల ఆధ్వర్యంలో ప్రవీణ్, చంపల వివాహం జరిగింది.

— అయిపోయింది —